ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





పెంచుతారా..? ముంచుతారా..?

- నర్సరీలలో పెంచే నారుపై సడలుతున్న నమ్మకం
- రైతుల నుండి ఇష్టారాజ్యంగా నిర్వాహకుల వసూళ్లు
- కొన్ని నర్సరీల్లో మొక్కలు తారుమారు చేస్తున్నట్టు ఆరోపణలు
- కొన్ని ప్రాంతాల్లో కంపెనీలే నర్సరీల నిర్వహణ
- పల్నాడు జిల్లాలో 300లకు పైగా నర్సరీలు

పల్నాడు జిల్లాలో 300లకు పైగా నర్సరీల్లో ఏటా 1.70 లక్షల ఎకరాలకు మిర్చి నారు పెంచే నిర్వాహకులు నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన లేకపోవడం, ప్రస్తుతం నర్సరీలపైనమ్మకం రైతులే సొంతంగా నారు పోసుకుని సంరక్షించడం వంటి కారణాలతో ఆయా నర్సరీల్లో లక్ష ఎకరాలకు లోపు నారు పెంచారని సమాచారం. జిల్లాలోని రాజుపాలెం, వినుకొండ, బొల్లాపల్లి, మాచర్ల, బెల్లంకొండ మండలాల్లో అధిక సంఖ్యలో మిర్చి సాగు కానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా నర్సరీలు ఏర్పాటయ్యాయి.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏటికేడు ఉద్యాన పంటల సాగులో చాలా మార్పులొస్తున్నాయి. నర్సరీల ఆవశ్యకత పెరుగుతోంది. గత 5 ఏళ్లుగా బొబ్బర, తామర తెగుళ్లతో నష్టపోతున్న రైతులకు గతేడాది మిర్చి ధరలు పడిపోవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఇవేమీ పట్టని నర్సరీ నిర్వాహకులు మాత్రం మిర్చి మొక్కలు పెంచినందుకు, అమ్మినందుకు రైతుల వద్ద అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు షేడ్‌నెట్ నిర్వాహకులు అనుమతులు లేకుండా తక్కువ రకం విత్తనాలతో నారు పెంచి అమాయక రైతులను దోచుకుంటున్నారు. వీరితో పాటు విత్తన కంపెనీ యాజమాన్యాలు సైతం బినామీలతో నర్సరీ నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి.





షేడ్‌నెట్ నర్సరీలలో మొక్కల పోషణపై దృష్టి ఉండటం వలన చీడ పీడల వ్యాప్తి కొంతమేర తగ్గి మొక్కలు ▶ 2లో

నర్సరీని నమ్మలేక సొంతంగా

గతేడాది తేజ రకం విత్తనాలు 10 గ్రాముల ప్యాకెట్ రూ.800 చొప్పున కొనుగోలు చేసి వినుకొండ దగ్గరలో గల నర్సరీలో ఇచ్చా. నా ముందే ట్రేలో ఆ విత్తనాలు వేసి దానికి సంబంధించి రసీదు ఇచ్చారు. తీరా నేను మొక్కలు తెచ్చే సమయానికి వెళ్తే మొక్కల్లో నాణ్యతపై అనుమానం కలిగింది. పంట దిగుబడి కూడా తగ్గింది. నేనిచ్చిన విత్తన రకాలనే నర్సరీల నిర్వాహకులు కిలోల చొప్పున సగం ధరకే కొనుగోలు చేసి ఆ విత్తనాల మొక్కలనే నాకు ఇచ్చినట్టు అర్థమైంది. చేసేది లేక ఈ ఏడాది సొంతంగా నేనే నారు పోసుకున్నా.

మండాది చక్రవర్తి, బొగ్గరం గ్రామం,ఈపూరు మండలం.

రషీద్ హత్య కేసులో మరో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - వినుకొండ



వివరాలు చెబుతున్న వినుకొండ పట్టణ సిఐ సాంబశివరావు

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వైసిపి కార్యకర్త రషీద్ హత్య కేసులో ఆరుగురు నిందితులను వినుకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సిఐ సాంబశివరావు గురువారం వెల్లడించారు. ఈనెల 17వ తేదీన రా 8 గంటల సమయంలో పట్టణంలోని పెద్ద మసీదు బజారుకు చెందిన షేక్ రషీద్‌ను అదే బజారుకు చెందిన షేక్ జిలాని స్థానిక ముళ్లమూరు బస్టాండులో కత్తితో నరికి హత్య చేశాడని, నిందితుణ్ణి ఈనెల 18వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. రషీద్ హత్యలో జిలాని తోపాటు మరో ఆరుగురికి ప్రమేయం ఉందని గుర్తించామన్నారు. నరసరావుపేట పట్టం బరంపేటకు చెందిన పఠాన్ అబు బరక్ సిద్ధిక్ ఎలియాస్ సిద్దు, వినుకొండ పట్టణం సీతయ్య నగర్‌కు చెందిన కొమ్ము వెంకటసాయి, నిమ్మలబాయి బజారు చెందిన కొమ్ము ఏడుకొండలు, బయలబోయిన అనిల్, ప్రకాశం జిల్లా పంగులూరు మండలం తక్కెళ్లపాడుకు చెందిన పనపర్తి సుమంత్, వినుకొండ పట్టణం ఇస్లాంపేటకు చెందిన షేక్ రోహిత్ ఎలియాస్ సోహెల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

ఇంటింటికి తాగునీరు అందేనా !

- జల్ జీవన్ మిషన్ పథకంలో రూ. కోట్లాది పనులు పెండింగ్
- కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు రాని వైనం
- కొత్త ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా?

7లో



రూ.1.63 లక్షల నిషేధిత కలుపుమందు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు



పార్శిల్ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న రాష్ట్ర, జిల్లా వ్యవసాయాధికారులు



ప్రత్తిపాడులో స్వాధీనం చేసుకున్న సరుకు

అనుమతులు లేని ఎరువులు, పురుగుమందులు, వితతనాల సరఫరా నివారణకు గురువారం జిల్లాలోని డీలర్ల, వారి పరిధిలోని రవాణా, పార్శిల్ కార్యాలయాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక జిటి రోడ్డులోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్‌లో ఎటువంటి బిల్లు లేకుండా ఒక వ్యక్తి పేరుపై 140 లీటర్ల గ్లైసెల్ కలుపుమందు గుంటూరుకు రాగా ఈ తనిఖీలలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.1,14,100 ఉంటుందని అధికారులు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని బస్టాండ్ ఎదురున్న ఒ పార్శిల్ కేంద్రంలో సుమారు రూ.48,900 విలువైన 60 లీటర్ల గ్లైసెల్ బిల్లులు లేకుండా ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్శిల్ గుంటూరు నుండి వలి డైలీ పార్శిల్ సర్వీసెస్ ద్వారా ప్రత్తిపాడుకు చెందిన పి.శ్రీనివాస్ అనే వ్యక్తి పేరు మీద వచ్చినట్లు గుర్తించారు. గ్లైసెల్ కలుపు మందును రాష్ట్ర ప్రభుత్వం 2018లో నిషేధించిందని, రాష్ట్రంలో గ్లైసెల్‌పై నిషేధం ఉన్న దృష్ట్యా కొందరు ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి తీసుకొచ్చి రహస్యంగా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో చట్ట వ్యతిరేక నిషేధిత కలుపు మందులు, ఎరువులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో డిఎఒ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సస్యరక్షణ విభాగం సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం.విజయభారతి, సస్యరక్షణ విభాగం సహాయ సంచాలకులు మద్దిలేటి, అర్బన్ వ్యవసాయాధికారి బి.గౌతమ్‌ప్రసన్న, ఒ.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుండి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులతో ప్రత్యేకమైన ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లబ్‌లు పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల అమ్మకాలు నివారించటం, డ్రగ్స్, మాదక ద్రవ్యాల గురించి అప్రమత్తంగా ఉండేలా విద్యార్థులను చైతన్య పరచటం వంటి కార్యక్రమాలు చేపడతాయన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న పిడిల ఆధ్వర్యంలో పాఠశాలల్లో 300లోపు విద్యార్థులు ఉంటే 20 నుండి సభ్యులతో, 300 మందికిపైన ప్రతి వందమంది విద్యార్థులకు ఇద్దరు చొప్పన ఏర్పాటు చేయాల న్నారు. కావున జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, అన్ని యజమాన్యాల ప్రధానోపాధ్యాయులు వెంటనే ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేసి, వివరాలు డిఇఒ కార్యాలయానికి పంపాలన్నారు.

నిరాశాజనకంగా కేంద్ర బడ్జెట్ : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

8లో



పెంచుతారా..? ముంచుతారా..?

(మొదటి పేజీ తరువాయి)

ఏపుగా, ఆరోగ్యంగా వస్తాయనే నమ్మకం రైతుల్లో పెరిగింది. దీనిని ఆసరాగా తీసుకున్న నిర్వాహకులు రైతుల నుండి ఒక్కో మొక్కకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. బెడ్ నర్సరీల్లో ఆశించిన సంరక్షణ ఉండక నాసి రకం విత్తనాలతో కొందరు రైతులు నష్టపోతుండగా షేడ్ నర్సరీలలో అదనంగా డబ్బులు చెల్లించలేక చిన్న, సన్నకారు రైతులు స్వయంగా నారు పెంచుకుంటున్నారు. రాష్ట్రంలోనే అధిక విస్తీర్ణంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏడు లక్షల ఎకరాల్లో మిర్చి సాగయ్యేది. తెగుళ్ల బెడదతో చిన్న సన్నకారు రైతులు మిర్చి సాగుకు దూరం అవుతున్నారు. సాగునీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనతోపాటు నీరు విడుదల చేస్తే మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.

కొన్ని నర్సరీలలో నాణ్యతపై సందేహాలు..

డిమాండ్ ఉన్న మిర్చి విత్తనాలను రైతులు అధిక ధరకు కొనుగోలు చేసి నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం రైతులు ఇచ్చేవారు. మొక్కలు పెంచి ఇస్తే ఒక్కో మొక్కకు 60 పైసలు నుండి 70 పైసలు వరకు వసూలు చేస్తున్నారు. మొక్కలే నేరుగా కొనుగోలు చేయాల్సి వస్తే సీజన్‌ను బట్టి రూ.2-6కు పైగా విక్రయిస్తుంటారు.ఈ నేపథ్యంలో రైతు ఇచ్చిన విత్తన రకం మొక్కలు కాకుండా ఇతర రకాలను అంటగట్టి నర్సరీల నిర్వాహకులు మోసం చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. విత్తనాలు, మొక్కలు, ట్రేలు మారుస్తుండటంతో కొన్ని నర్సరీలపై సందేహాలు వస్తున్నాయి.

నాసిరకం నారు విక్రయిస్తే చర్యలు

చైకం రమణారెడ్డి, పల్నాడు జిల్లా ఉద్యాన శాఖాధికారి.



మిర్చి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు వివరాలు, లాట్ నంబర్ విత్తనం తయారు చేసిన తేదీ, నారు మొక్కలు అమ్మిన తేదీ నమోదు చేసి రసీదు ఇవ్వాలి. నర్సరీ నిర్వాహకులు అక్కడ లభించే నారు మొక్కల సంఖ్య, ధరల పట్టిక ప్రధాన ద్వారం వద్ద బోర్డుపై పేర్కొనాలి. నారు పెంపకానికి సరైన భూమి ఎంచుకోవడం, పిల్ల, తల్లి మొక్కల బ్లాక్ లను వేరుగా ఉంచడం, మొలకలు, నర్సరీ బెడ్ల తయారీ, షేడ్ నెట్ హౌస్, నెట్ హౌస్, పాలీ టన్నెల్, తదితర మౌలిక వసతులు నర్సరీల్లో ఉండాలి. ఉద్యాన అధికారులు నర్సరీలను తనిఖీ వచ్చిన సమయంలో ఏమైనా లోపాలున్నా, రైతులు ఇచ్చిన విత్తన రకాలు కాకుండా మార్చి ఇచ్చిన చర్యలు తప్పవు. ఈ ఏడాది పత్తి విత్తే సమయం మించిపోతున్న దష్ట్యా మిర్చి సాగు పెరిగే అవకాశం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని నర్సరీ నిర్వాహకులు అధిక ధరలకు మొక్కలు అమ్మినా, నాసిరకానికి ఇచ్చినా చర్యలు తప్పవు.



అనుమతి పత్రం చూపుతున్న నాతాని వెంకటేశ్వర్లు

కృష్ణవేణి డిగ్రీ కాలేజీకి పదేళ్ల పాటు అటానమస్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు 2024-2025 విద్యా సంవత్సరం నుండి పదేళ్లపాటు (2033-34) యుజిసి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం అధ్యాపకులతో, నాణ్యమైన విద్యా ప్రమాణాలతో విద్యా బోధన నేపథ్యంలో తమ కళాశాలలో బహుళ జాతి కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. పలు కంపెనీల్లో ఉన్నత స్థానంలోనూ ఉన్నారన్నారు. తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు ఆట పాటలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. విశాలమైన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే తమ తమ కళాశాలకు అత్యున్నత స్వయంప్రతిపత్తి గుర్తింపు లభించిందన్నారు. అటానమస్ హోదా వలన స్వయంగా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన విధంగా పాఠ్యాంశాలు పొందు పరచడం, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణకు కోర్సులు నిర్వహించటం, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించుకునే అవకాశం లభించిందని వివరించారు. స్వయం ప్రతిపత్తి హోదా వలన స్వయంగా పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు సిలబస్ మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. హోదా వల్ల బహుళ జాతి కంపెనీలు తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. తమ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా లభించడంతో కళాశాల నిర్వహణపై తమ బాధ్యత మరింత పెంచిందన్నారు.



నల్లమల అడవిలో విత్తనబంతులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నల్లమల అడవి, కారంపూడి అడవి పరిధిలో కోటి విత్తన బంతులను గురువారం చాల్లారు. ఈ కార్యక్రమానికి వివిధ హోదాల్లోని ఉద్యోగులు ముఖ్యంగా పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసప్, కారంపూడి ఎంపిడిఒతదితర అధికారులు హాజరయ్యారు. కార్యక్రమం రూపకర్త అయినా పర్యావరణ వేత్త కొమెర జాజి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అడవులు శాతం వృద్ధి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, 33.3 శాతం అడవులు వృద్ధి కోసం ప్రతి ఒక్కరు పని చేయాలి కోరారు. ఇది విత్తనబంతులు ద్వారా తేలికవుతుందన్నారు. తొలకరి జల్లులు, వర్షాకాలంలో విత్తనబంతులు చల్లడం అనేది ప్రతిఒక్కరు ఒక ఆనవాయితిగా పెట్టుకోవాలని అన్నారు.

పల్నాడు ఎస్పీని కలిసిన డాక్టర్ కోడెల శివరాం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కంచి శ్రీనివాసరావును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ గురువారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి సత్కరించారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల స్థాపన, ఇటీవల ఘటనలపై కొద్దిసేపు చర్చించారు.

పశువులకు వ్యాధినిరోధక టీకాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వర్షాకాలం పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకే అవకాశం ఉందని సత్తెనపల్లి పశుసు సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు తెలిపారు. లంపిస్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. సత్తెనపల్లినియోజకవర్గంలోని ఇరుకుపాలెం, కొమెరపూడి, ధూళిపాళ్ల, మాదల, పెదమక్కెన గ్రామాల్లోని పశువుల వైద్యశాలలో ఎద్దులకు, ఆవులకు లంపీస్కిన్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలను వేసినట్లు చెప్పారు. ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుందని, మూగ జీవాలున్న ప్రతి ఒక్కరూ వేయించాలని సూచించారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు



విద్యార్థుల్లోని సజనాత్మకత వెలికి తీసేందుకు శిక్షా సప్తాహ్ ఎంతగానో దోహదపడుతుందని ఎంఈవో ఎం.నాగరత్నం అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు సాంస్కృతిక దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పద్యాలు, అభినయ గేయాలు, నాటికలు, సంప్రదాయ నత్య ప్రదర్శనలపై శిక్షణిచ్చారు. అనంతరం వారిచే ఆయా ప్రదర్శనలను చేయించారు. ఆయా పోటీల్ని పరిశీలించిన ఎంవీవో మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రవేశాన్ని కల్పించడమే శిక్షా సప్తాహ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా స్నేహపూరిత వాతావారణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.లక్ష్మీతులసీ, ఉపాధ్యాయులు పద్మజ, రత్నకుమారి, విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు.

నిఘా కెమెరాల నీడలో మంగళగిరి


పట్టణ పోలీస్ స్టేషన్లో సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్న సిఐ వినోద్ కుమార్

ప్రజాశక్తి మంగళగిరి

నేరాల నియంత్రణకు పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే మేలని భావిస్తున్నారు. ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునే విధంగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. చెడిపోయిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చిన పోలీసులు అవసరమైన ప్రాంతాన్ని గుర్తించి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

గత కృష్ణా పుష్కరాల సమయంలో మంగళగిరి పట్టణంలో మొత్తం సుమారు 76 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 52 మ్యాట్రిక్స్ కంపెనీకి చెందినవి కాగా, మిగిలిన 24 పురపాలక సంఘానికి చెందినవిగా తెలుస్తోంది. వీటిలో ఎక్కువ శాతం పని చేయకపోవడంతో పలు నేరాల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను గుర్తించటం కష్టతరంగా మారిందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెడిపోయిన అన్ని సీసీ కెమెరాలకు పురపాలక సంఘ అధికారుల సహకారంతో ఇప్పటికే మరమ్మత్తులు చేయించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీ టీవీ ద్వారా వాటి పనితీరును పట్టణ సీఐ వినోద్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. మంగళగిరిలోకి ప్రవేశించే మార్గాలతో పాటు మంగళగిరి పట్టణం నుండి బయటకు వెళ్లే కూడళ్లలో సీసీ కెమెరాలను వినియోగంలోకి తెచ్చామని సిఐ వినోద్ కుమార్ తెలిపారు. మిద్దె సెంటర్, గాలిగోపురం అంబేద్కర్ సెంటర్, తెనాలి ఫ్లై ఓవర్, కుప్పురావు కాలనీ, గౌతమ్ బుద్ధ రోడ్డు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రత్నాల చెరువులో ఓ దాత సహకారంతో త్వరలో 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మరో నెల రోజుల్లో పట్టణం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. అసాంఘిక శక్తులను అణచివేసేందుకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు నగర పాలక సంస్థ అధికారుల సహకారంతో మంగళగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వినోద్ కుమార్ తెలిపారు. తొలుత జామ్ జామ్ రెస్టారెంట్ వద్ద యూటర్న్ సదుపాయాన్ని కల్పించి రైల్వే స్టేషన్ కు చేరుకునేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు కూడా అవసరమని పలు ప్రదేశాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రోడ్డు వెంబడి ట్రాఫిక్ కు అవరోధం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆక్రమణలను తొలగిస్తామని అన్నారు.

రూ.60 వేలు సోత్తు అపహరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో బంగారు ఆభరణాలు అపహరించారు. సత్తెనపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గొట్టిముక్కల స్వాతి 8 వార్డు క్రిస్టియన్ పేటలో నివాసంఉంటుంది. భర్త జయప్రకాష్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యానని బాధితురాలు స్వాతి పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. నాలుగు బంగారపు ఉంగరాలు బంగారపు చైన్ దొగిలించారని వీటి విలువ 6వేలవరకు ఉంటుందని ఫీర్యాదులో పేర్కొంది. ఇంటి పనులకోసం పనిమనిషిని పెట్టుకున్నామని ఆమె అనారోగ్యం కారణంగా ఆమె.బందువుల అమ్మాయిని పంపించిందని పనులు చేసేందుకు వచ్చిన వారే దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పలు మెడికల్ షాపులు, ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని పలు మెడికల్ షాపులపై, ఒక ప్రవేట్ క్లినిక్‌పై డ్రగ్ ఇనస్పెక్టర్లు తమ సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇనస్పెక్టర్ సునీత, విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ఒక ప్రైవేటు క్లినిక్‌పై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఫైల్స్‌కు (మొలలు) సంబంధించిన చికిత్స అందించే ప్రథమ చికిత్సాలయంపై ఫిర్యాదులు రావటంతో తనిఖీలకు వచ్చినట్లు తెలిపారు. ప్రథమ చికిత్సాలయంలో ఆయుర్వేద వైద్య విధానం అవలంభిస్తున్నట్లుగా ఇక్కడ డాక్టరు రాయ్ తెలియజేసినట్లు తెలిపారు. దానికి సంబంధించిన అధికారులు మాత్రమే దీనిని తనిఖీ చేయాలని వివరించారు. తమ పరిశీలనలో లోపాలు ఏమి కనిపించలేదన్నారు. నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. పలు మెడికల్ షాపులపై కూడ దాడులు చేసినట్లు తెలిపారు. మీ పోర్టల్‌లో ఒక వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేసినట్లు తెలియవచ్చింది.

ఫొటోగ్రాఫర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఫోటోగ్రాఫర్ మట్టుపల్లి మోజేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడిలో నందిగామ గ్రామానికి చెందిన మట్టుపల్లి మోజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి నుండి నందిగామ వెళుతుండగా మార్గమధ్యంలో పెట్రోల్ బంక్ సమీపంలో ఆరుగురు వ్యక్తులు మూడు బైకులపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని బాధితుడు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుల్లగూర పీటర్ బాబు, మట్టుపల్లి మోజేష్ ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి నుండి నందిగామ వెళుతుండగా మార్గమధ్యంలో నందిగామ తాటిచెట్లు సమీపంలో ఆరుగురు యువకులు బైకులపై వచ్చి వెనుక కూర్చున్న మోజేష్‌ను కిందికి లాగి దాడిచేశారు. పీటర్ బాబు బయపడి వెళ్ళిపోయాడు. యువకులు దాడిచేసి మోజేష్ ను వివస్త్రను చేసి పక్కన పడేశారు. తిరిగి వచ్చిన పీటర్ తీవ్రంగా గాయపడ్డిన మోజేష్‌ను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మోజేష్ వైసిపి సోషల్ మీడియాలో పనిచేస్తూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలిం చారు. మోజేష్ గతంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు వద్ద వ్యక్తిగత ఫోటోగ్రాఫర్‌గా పనిచేశారని తెలిసింది.

జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రాన్ని పాత భవనంలోకి మార్చండి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కార్యాలయాన్ని గతంలో ఉన్న భవనంలోకి మార్చాలని మాదిగ పరిశోధక, విద్యార్థి సంఘ నాయకులు యూనివర్సిటీ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు నాయకులు గురువారం వీసీ ఆచార్య కె గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి వెంకటేశ్వర్లు తదితరులను కలిసి వినతిపత్రం సమర్పించారు. బాబూ జగ్జీవన్రామ్ అధ్యయన కేంద్రాన్ని 2018వ సంవత్సరంలో యూనివర్సిటీలోని పాత ఎస్బీఐ భవనంలో అధికారికంగా ప్రారంభించారని, ఆ భవనంలో అన్ని వసతులు అప్పటి అధికారులు కల్పించారని తెలిపారు. కానీ 2019 చివర్లో బాధ్యతలు తీసుకున్న యూనివర్సిటీ ఉన్నతాధికారులు, బాబూ జగ్జీవన్రామ్ అధ్యయన కేంద్రం అధికారులు కలిసి ఉద్దేశపూర్వకంగా ఆ కేంద్రాన్ని నిర్వీర్యం చేశారన్నారు. బాబూ జగ్జీవన్రామ్ అధ్యనకేంద్రానికి, న్యూఢిల్లీలోని బాబూ జగ్జీవన్ రామ్ ఫౌండేషన్కు మధ్య జరిగే లిఖితపూర్వక అంశాలలో ఇప్పటికీ జగ్జీవన్రామ్ అధ్యయన కేంద్రం ఏఎన్‌యూలోని పాత ఎస్బీఐ భవనంలోనే ఉందని రాస్తున్నారని తెలిపారు. జగ్జీవన్రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులు, శిక్షణ, అవగాహన తదితర కార్యక్రమాలకు ప్రస్తుతం ఉన్న చిన్న గదులు చాలడం లేదని, అన్ని అంశాలు పరిశీలించి వెంటనే జగ్జీవన్రామ్ అధ్యయనకేంద్రాన్ని పాత ఎస్బీఐ భవనంలోకి మార్చాలని వారు ఉన్నతాధికారులను కోరారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో పరిశోధక సంఘ నాయకులు వై రాజేష్, డాక్టర్ రాజశేఖర్, సునీల్, చంద్రబాబు, శ్యాంసన్, ఎంఎస్ఎఫ్ ఏఎన్ యూ శాఖ అధ్యక్షుడు ప్రసాద్, దిలీప్ ఉన్నారు.

బాలలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

బాల బాలికలు చైతన్య వంతమైనప్పుడే అన్ని రంగాల్లో రాణించ గలుగుతారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం జెడ్పి హైస్కూల్ లో గురువారం బాలబాలికలకు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఇన్ ఛార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాల బాలికలను ఉద్దేశించి సంస్థ సిబ్బంది జొన్నకూటి ఇశ్రాయేల్, తుళ్లూరు కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ, ఐక్య రాజ్య సమితి 1989 నవంబర్ 20 వ తేదీన బాలల హక్కులను ప్రతిపాదించిందని, వాటిని మన పార్లమెంట్ లో 1992 లో ఆమోదించటం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో పెదకాకాని కమ్యూనిటీ ఆర్గనైజర్ బి విజయ లక్ష్మి మాట్లాడుతూ, బాలలకు భద్రత కల్పించట, బాలలపై లైంగిక దాడులు జరిగినప్పుడు వాటిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. పిల్లలను శారీరకంగా కొట్టటం, కాల్చటం ,హింసించడం లాంటివి జరిగినప్పుడు ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 1098 ద్వారా ఫిర్యాదు చేయవచ్చున్నారు. హెచ్ ఎం జి శివకుమార్, ఎం అరుణ ఎం కోటేశ్వర రావు, నరసింహారావు, నాయక్ పాల్గొన్నారు.

వర్శిటీ వద్ద ఘనంగా హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు :ప్రముఖ సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలు గురువారం జరిగాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద నారా రోహిత్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో వర్సిటీ ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు, అభిమానులు బర్త్ డే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. జన్మదిన కేకును కట్ చేస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వాన్ని బలపరుస్తూ జేజేలు పలికారు. హీరో రోహిత్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు, యువత అన్ని రంగాలలో రాణించాలని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత అట్లూరి నారాయణరావు పిలుపునిచ్చారు. టిడిపి పార్టీ అనుబంధ సంఘాల సమన్వయకర్త డాక్టర్ మండూరి వెంకటరమణ మాట్లాడుతూ యూనివర్సిటీకి, సినీ హీరో రోహిత్ కు మధ్య అనుబంధం ఉందన్నారు. గతంలో కూడా రెండు పర్యాయాలు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాలకుహాజరయ్యారని, భవిష్యత్తులో కూడా వర్సిటీలో నిర్వహించే సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తన వంతు సహకారం అందిస్తారని రోహిత్ వెల్లడించినట్లు రమణ తెలిపారు. అనంతరం సుమారు 600 మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వర్సిటీ పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు, నారా రోహిత్ అభిమాన సంఘ అధ్యక్షుడు ఆరే గోపి చౌదరి, టిఎన్టియుసి అధ్యక్షులు వి. విష్ణు ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బత్తుల హేమంత్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం , కాజా గ్రామం శివారు పొలాల్లో లహరి వెంచర్‌లో చెట్టుకు ఉరివేసుకొని చనిపోయిన యువకుడిని స్థానికులు గుర్తించారు. విషయాన్ని వెంటనే పోలీసులకు తెలిపారు. గ్రామస్తులు, పొలాలలోని రైతులు తెలిపిన వివరాలు మంగళగిరి మండలం కాజా గ్రామం శివారులోని లహరి వెంచర్ కాళీ స్థలాల్లో ఉన్న చెట్టుకు పడమట శ్రీనివాసరావు (36) యువకుడు ఉరివేసుకుని చనిపోయాడు. గురువారం ఉదయం పొలాలలోని రోడ్లలో స్కూటీపై తిరిగినట్లు విషయాన్ని పోలీసులకు తెలియజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలానికి మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ప్రొబేషనరీ డిఎస్పీ , సిబ్బంది పరిశీలించి అక్కడ స్కూటీని, బ్యాగును, పురుగుల మందు కొంత తాగి ఉన్న డబ్బాను గుర్తించడం జరిగిందని తెలిపారు. దీనిపై వారి బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని హాస్పటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



26 మద్యం సీసాలు స్వాధీనం నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు మాచర్ల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.పి కిషోర్ తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాచర్లమండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన కొండ లింగయ్య వద్ద 180 ఎంఎల్ సామర్థ్యం గల విస్కీ14 సీసాలు, 180ఎంఎల్ సామర్థ్యం గల బ్రాందీ 12 సీసాలులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడు కొండ లింగయ్య ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ కెపి కిషోర్ తెలిపారు.

ప్రజారోగ్యంపై మరింత అప్రమత్తంగా ఉండాలి

- వైద్యులు, సిబ్బందికి పల్నాడు కలెక్టర్ ఆదేశం
- శావల్యాపురం ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి - వినుకొండ

వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజారోగ్యం పట్ల అధికారులు జాగ్రత్తలు వహించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది రోజువారి అటెండెన్స్ రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపి రికార్డును పరిశీలించిన కలెక్టర్ ఎటువంటి వ్యాధులతో రోగులు వైద్యశాలకు వస్తున్నారు? అనే అంశంపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు అందించే సేవలు ఆన్లైన్లో నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. వైద్యశాలలో ఉన్న రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలకు అవసరమైన లక్షలు విలువచేసే అధునాతన పరికరాలు ఉన్నప్పటికీ ఫ్రిజ్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉందని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఫ్రిజ్ ఏర్పాటు చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. వర్షా కాలం నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో కొర్రపాటి అనితతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపై దృష్టి సారించాలని తెలిపారు. 15 గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రటరీలు, సిబ్బందితో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రెయినేజీ పూడికలు తీయించుట, దోమల ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో సిబ్బంది తగిన జాగ్రత్తలు వహించాలని, శుద్ధమైన త్రాగునీరు సరఫరా చేయాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయ సిబ్బందితో పరిస్థితుల గురించి అడిగారు. ఎంపీడీవో, తహశీల్దారు కార్యాలయంలో దస్త్రాల నిర్వహణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, స్థానికులు అందించిన అర్జీలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు ఆర్డీవో సరోజినిదేవి, ఇన్చార్జ్ జిల్లా వైద్యాధికారి పద్మావతి, డిప్యూటి తహశీల్దారు వేముల వెంకటనాగరాజు, ఆర్ఐ పేరుసోముల నాసరయ్య తదితరులున్నారు.

అంగన్వాడీలపై రాజీనామా వత్తిళ్లు మానుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి

అంగన్వాడీలపై కూటమి పార్టీల నాయకులు ఐసిడిఎస్ సిడిపిఒ ద్వారా రాజీనామా ఒత్తిళ్లు మానుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ స్కీం వర్కర్లు ఎన్నో సంవత్సరాల నుండి ప్రభుత్వాలు ఇచ్చే గౌరవేతనంతో కుటుంబ పోషణం సాగిస్తున్నారని, వారిపై అధికార పార్టీ గ్రామ, మండల నాయకులు అధికారుల ద్వారా ఒత్తిడి చేసి రాజీనామా చేయించాలని మాట్లాడించటం సరైన పద్ధతి కాదని అన్నారు. ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం పార్టీ నాయకులు వారి పైన మానసిక ఒత్తిడికి గురిచేసి ప్రమాదాలకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఎప్పటికైనా తమ చిరుద్యోగాలు పర్మినెంట్ చేస్తారని ఆశిస్తున్నా వారికి ఇప్పుడు తొలగింపుల భయం పట్టుకుందని ఆందోళన వెలిబుచ్చారు. కక్ష సాధింపులు ఉండకూడదని సిఎం చంద్రబాబు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలా లేదని అన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది సేవ చేయడానికి కానీ ఉద్యోగులపైన మీ ప్రతాపాలు చేయడానికి కాదనే విషయాన్ని గుర్తించాలని కోరారు.



నివాలులర్పిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

సిపిఎం క్రోసూరు మండల కార్యదర్శికి మాతృవియోగం

ప్రజాశక్తి - క్రోసూరు

సిపిఎం మండల కార్యదర్శి అయిన ఎర్రబాలేనికి చెందిన టి.హనుమంతరావు తల్లి తిమ్మిశెట్టి రాజ్యలక్ష్మి (68) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, జి.రవికుమార్ సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాజ్యలక్ష్మి కష్టజీవులతో చాలా కలివిడిగా ఉంటారని, ఏ కుటుంబంలో సమస్య వచ్చినా మాట మంచి సహాయం చేసేవారని చెప్పారు. రైతు, మహిళ ఉద్యమాలు, కార్యక్రమాలకు మద్దతుదారుగా ఉన్నారని గుర్తు చేశారు.

క్షయ నిర్మూలనకు బిసిజి టీకాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

క్షయ నిర్మూలనలో భాగంగా ప్రతి సోమ, గురువారాల్లో వైద్య సిబ్బంది బీసీజీ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యడ్లపాడు రచ్చబండ సెంటర్లోని అంగన్వాడీ కేంద్రంలో 18 ఏళ్లు నిండి అనారోగ్యం పాలైన వారు, 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గురుమూర్తి, ఎఎన్ఎం పార్వతి, ఆశా, అంగన్వాడీలు పాల్గొన్నారు.



జల్‌జీవన్ ప్రాజెక్టులోని అవాంతరాలను తొలగించండి

పార్లమెంట్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావన - కేంద్ర మంత్రి హామీ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో జలజీవన్ ప్రాజెక్టు ముందుకు వెళ్ళటంలోని అవాంతరాలను తొలగించి ప్రతి ఇంటికి నీరు అందించేందుకు సహకరించాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు రూ.350 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి, అక్కడినుంచి ప్రతి ఇంటికి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే పల్నాడులో ఈ ట్యాంక్‌లను నింపేందుకు నీటి కొరత ఉందని, కొన్ని ప్రాంతాల్లో దాదాపు 1200 అడుగులు బోర్లు వేస్తేనే నీరు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఈ స్థితిలో ప్రత్యామ్నాయ ప్రణాళికతో నీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించాలని, పెద్ద మొత్తంలో మంజూరైన నిధులు వృథా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర జల వనరుల మంత్రి సిఆర్ పాటిల్ మాట్లాడుతూ పలు సమావేశాల్లో ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి, నీరు ఎక్కడ లాభ్యమౌతుంది, ఎక్కడ బోర్లు వేస్తె నీరు పడుతుంది అనే విషయాన్ని తెలుసుకోవచ్చని, కొన్ని గ్రామాల్లో అవసరాన్ని బట్టి రెండు బోర్లు కూడా వెయ్యాల్సి వస్తోందని దీనికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిసింది.

ఆశ్రమ పాఠశాల తనిఖీ తనిఖీలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్



తాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏడో మైలు ఆశ్రమ పాఠశాలను గురువారం ఎంపీడీఓ సరోజినీ, సర్పంచ్ పశుపులేటి బ్రహ్మానాయుడు తనిఖీ చేశారు. ఆధార్ క్యాంప్‌ను పరిశీలించి గ్రామంలోని పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంకటరామయ్య, నాయకులు చింతకాయల ఆంజనేయులు, నాగేశ్వరరావు, కురబోయిన రామారావు, పగడాల కోటేశ్వరరావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కరకట్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట : వాగు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కరకట్టలు మార్గమని, వీటిని ధ్వంసం చేయడమంటే ముప్పును కొనితెచ్చుకోవడమేనని, వీటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో- కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వాగు పరివాహన ప్రాంతాల్లో వరదలు ముంచేత్తకుండా ప్రభుత్వం కరకట్టలు ఏర్పాటు చేసిందని, అయితే వార్డు ప్రజాప్రతినిధి భర్త నిర్వాకం వల్ల కరకట్టల మట్టిని తవ్వి కరకట్టలను ధ్వంసం చేయడం వల్ల సమీప ప్రాంత ప్రజలకు ముంపు సమస్య ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సహజ వనరులనుసైతం దోచుకున్న, కరకట్టల మట్టి తవ్వకాలు చేసినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులపై అక్రమ కేసులు ఎత్తివేతపై హర్షం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఉద్యోగులపై సిపిఎస్ ఉద్యమ సంబంధిత కేసులను కొట్టివేస్తామని అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం చాలా ఆనందదాయకమని ఏపీ సిపిఎస్ఇఎ రాష్ట్ర మహిళా అధ్యక్షులు డాక్టర్ సాంబేలు శాంతిబాయి గురువారం సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా జిపిఎస్‌ని కూడా రద్దుచేసి ఓపిఎస్‌ని తీసుకురావాలని సీఎంను కోరినట్లు శాంతిబాయి తెలిపారు.

పత్తిలో పచ్చదోమ, తామరపురుగు తెగుళ్లు

- అంతర పంటల సాగుతో తెగుళ్ల నివారణ, అదనపు ఆదాయం
- పత్తి పొలాలను పరిశీలనలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి



పత్తి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లాలో పత్తి సాధారణ సాగు 267,890 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 65,557 ఎకరాల్లో సాగైనట్లు పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. సత్తెనపల్లి పట్టణ పరిధిలో ఉన్న పత్తి పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. పత్తి పంట సాగు చేయదలసిన రైతులు వచ్చేనెల రెండవ వారం వరకు విత్తు కొనుటకు ఆశాజనకంగా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం పత్తి పైరులో పచ్చ దోమ, తామర పురుగులను గుర్తించామన్నారు. నివారణకు ఎసిఫేట్ 350 గ్రాములు లేదా ఏసిటామిప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రాములు లేదా పిప్రోనిల్ 400 మీల్లీ లీటర్లు 200 లీటర్లు నీటిలో కలిపి 10 రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలని వివరించారు. పత్తి పంట చుట్టూ జొన్న లేదా మొక్క జొన్న పంటలను 2-3 వరసలు నాటితే రసం పీల్చే పురుగులు ఆశించకుండా నివారించవచ్చని తెలిపారు. ఆముదపు మొక్కలు పొలంలో ఎకరాకు 10 మొక్కలు నాటితే పొగాకు లద్దే పురుగు నియంత్రిచ్చుకోవచ్చున్నారు. కంది పంటను పత్తి పంటలో 5-6 వరసులకు ఒక వరుస అంతర్ పంటగా నాటినట్లయితే మిత్ర పురుగుల సంతతి పెంచవచ్చని, అదనపు ఆదాయమూ లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ఎడిఎ ఎస్.శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలముందు ఇచ్చిన హామీని అమలు చేయాలి

గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలి : సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్



మాట్లాడుతున్న పాశం రామారావు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గుంటూరు చానల్ పొడిగింపునకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జంపని రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాశం రామారావు ప్రసంగించారు. చాలా కాలంగా రైతులు కోరుతున్న నల్లమడ ఆధునీకరణ పనులు కూడా చేపట్టి పంటలను ముంపు నుండి కాపాడాలని కోరారు. గుంటూరు చానల్ పొడిగింపు కొరకు పెదనందిపాడు, పర్చూరు ప్రాంత రైతులు గత 60 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారన్నారు. గుంటూరు చానల్ పొడిగింపు వలన 50 గ్రామాలకు తాగునీరు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. నల్లమడ వాగుకు గండ్లు పడి వరదలు వచ్చినప్పుడు పంట పొలాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని దాని నివారణకు గాను నల్లమడ వాగు ఆధునీకరణ చేపట్టాల్సి ఉందని అన్నారు. మేకల వాగుతోపాటు జిల్లా వ్యాపితంగా ఉన్న పంట కాల్వలలో పూడికలు, తీసి బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ సీజన్ మొదలైనందున ఆర్‌బికెలు, సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, పచ్చి రొట్టె సబ్సిడీ ధరలకు అందించే ఏర్పాటు చేయాలన్నారు. గత తుపానుకు పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందించాలని అన్నారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంభందం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షా కాలంలో పేదలు నివశించే ప్రాంతాలలో నీరు నిలిచి దోమలు, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మంచినీటిని ఫ్లోరినైజేషన్ చేసి అందించాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ పెదనందిపాడులో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, గుంటల మయమైన రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టి ప్రమాదా లను నివారించాలని కోరారు. వ్యవసాయ పనులు దొరక్క వ్యవసాయ కార్మికులు పస్తులుండే పరిస్థితులు ఉన్నాయని, వారికి ఉపాధి హామీ పని ద్వారా పని కల్పించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.

నీటి మడుగుల్లో గంబూషియా చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-తాడేపల్లి :



రూరల్ ప్రాంతాల పక్కన ఉన్న నీటి మడుగుల్లో దోమ పిల్లలను తినే గంబోషియా జాతి చేప పిల్లలను విడుదల చేశారు. డెంగీ నివారణ మాసో త్సవాల్లో భాగంగా తాడేపల్లి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ చేపలు దోమలు నీటిలో పెట్టిన గుడ్ల నుంచి వచ్చిన దోమ పిల్లలను వెంటనే తినేస్తాయి. దోమకాటు వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాసన తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాజధానిలో పుట్ట గొడవలు

ప్రజాశక్తి - తుళ్లూరు


పుట్టగొడుగుల కోసం వెదుకులాట

రాజధానిలో పుట్టగొడుగుల కోసం వెతుకులాట మొదలైంది. గడ్డ పలుగు, గునపం లాంటి వాటిని చేతపట్టుకొని మట్టి పుట్టల కోసం గాలిస్తున్నారు. పుట్టలు తవ్వి పుట్ట గొడుగులను ప్లాస్టిక్ కవర్లలో వేసుకొని ఇళ్లకు తీసుకువెళుతున్నారు. పుట్ట గొడుగుల కోసం వెతికేవారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో కొద్దిపాటి గొడవలు కూడా జరుగుతున్నాయి. ఈ పుట్ట నాదంటే నాదని పోటీ పడు తున్నారు. ఉరుములు, మెరుపులతో వర్షాలు పడుతుంటే మట్టి పుట్టల్లో పుట్ట గొడుగులు కనిపిస్తుండడం అందరికీ తెలిసిందే. రాజధానిలో వివిధ నిర్మాణ పనుల్లో వినియోగించేందుకు కంకర, ఇసుక, మట్టిని నిల్వ వుంచారు. ఏళ్లుగా జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో పిచ్చి కంప, తుప్పు చెట్లుతో పాటు మట్టి పుట్టలు ఎక్కువ య్యాయి.ఈ పుట్టల్లో పుట్ట గొడుగులు లభ్యమవు తున్నాయి. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో పుట్ట గొడుగుల కోసం గాలించే వారి సంఖ్య ఎక్కువైంది. కొద్దిపాటి పుట్టగొడుగుల కట్ట రూ .400 నుంచి 500 ల వరకు ధర ఉండడం, పుట్ట గొడుగులలో పోషకాలు ఎక్కువగా ఉండడం, కూర రుచికరంగా ఉండడంతో పుట్టలు కనిపిస్తే చాలు అక్కడ వాలి పోతున్నారు. పుట్ట గొడుగులు కావాలంటే గుంటూరు, విజయవాడ, మంగళగిరి లాంటి పట్టణాలకు వెళ్లి ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కొనాలనుకున్న సమయంలో పట్టణాల్లో సైతం ఖచ్చితంగా దొరుకుతా యన్న గ్యారంటీ ఉండదు. ఈ కారణంగా కూడా పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా పుట్టగొడుగుల కోసం పోటీ పడుతున్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్డుకు రైతుల అభ్యంతరాలు ఎందుకు?

ప్రజాశక్తి-తాడేపల్లి



మణిపాల్ ఆసుపత్రి నుంచి తాడేపల్లి, ఉండవల్లి, పెనుమాక పొలాల మీదుగా రాజధాని అమరావతికి అనుసంధానంగా నిర్మించే సీడ్ యాక్సిస్ రోడ్డుకు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఉండవల్లి, పెనుమాక రైతులు మాత్రమే సీడ్ యాక్సిస్ రోడ్డుకు అభ్యంతరాలు లేవని చెబుతూనే తమకు సరైన న్యాయం చేయాలని కోరుతున్నారు. రాజధానిలో భూములిచ్చిన రైతులకు ప్లాట్లు అభివృద్ధి చేసి అందరికీ ఇచ్చిన విధంగా 1450 గజాలు కాకుండా తమకు అధికంగా 2400 గజాలు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. అందరికీ సమానంగా కాకుండా ఈ రెండు గ్రామాల రైతులకే ఎందుకు ఇవ్వాలనేది చర్చనీయాంశంగా మారింది. సంవత్సరానికి మూడు నుంచి నాలుగు పంటలు పండే తమ భూములకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రెండు గ్రామాలకు సంబంధించి 700 ఎకరాలపై గ్రీన్‌జోన్, యు1 రిజర్వ్ జోన్ విధించారు. గ్రీన్‌జోన్‌లో ఉన్న భూములు రైతులు పంటలు పండించడానికి వీల్లేదు. వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండటానికి పచ్చని చెట్లు పెంచాలి. అది కూడా పది అడుగుల ఎత్తు మించి పెరగకుండా ఉండే చెట్లను మాత్రమే ఆ భూముల్లో వేయాలి. యు1 రిజర్వ్ జోన్ భూముల్లో ప్రభుత్వానికి ఎప్పుడు అవసరమైతే అప్పుడు తీసుకునే అవకాశం ఉంది. తాడేపల్లిలో గతంలో ప్రకటించిన యు1 రిజర్వ్ జోన్ మీద రైతులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. గత ప్రభుత్వానికి యు1 జోన్ విషయంలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఎన్నికలకు ముందు తాడేపల్లిలో యు1 రిజర్వ్ జోన్ ఎత్తివేశారు. ఉండవల్లి రైతులు కూడా యు1 రిజర్వ్ జోన్‌తో పాటు గ్రీన్‌జోన్ ఎత్తివేయాలని కోరుతున్నారు. లేదంటే తమకు రాజధానిలో భూములిచ్చిన రైతులకు కమర్షియల్, రెసిడిన్షియల్ ప్లాట్లలో ఇచ్చే 1450 గజాలు కాకుండా 2400 గజాలు ఇవ్వాలని కోరుతున్నారు. రాజధాని అమరావతి కనెక్టవిటీ రోడ్డుకు సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రధానమైనది. ఈ విషయంలో ప్రభుత్వం పంతాలు పట్టింపులకు పోకుండా రైతులు కోరిన విధంగా వారికి అదనంగా కొన్ని గజాలు ఇచ్చి సీడ్ యాక్సిస్ రోడ్డుకు లైన్ క్లియర్ చేసుకుంటే అటు ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఇటు రైతులకు కూడా మేలు జరిగి తాము అనుకున్న పరిహారం దక్కిందని సంతోషంగా భూములిచ్చే అవకాశం ఉంది.

రాజధానిలో ఘంటశాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మూడు విజ్ఞాపనలను ఆవిష్కరించిన ఘంటశాల చైతన్య వేదిక

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘం టసాల విగ్రహాన్ని, కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని, నటరత్న ఎన్టీఆర్ పద్మశ్రీ ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని, హైదరాబాదులో ట్యాంక్ బండ నిర్మించిన విధంగా కృష్ణా నదికి ఇరువైపులా తెలుగుజాతి మహోన్నత వ్యక్తులు, స్వాతంత్ర సమరయోధులు, కవులు, రచయితలు , కళాకారులు, నటులు విగ్రహాలు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ఊరురా జన విజ్ఞానం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఘంటసాల విగ్రహ సాధన కమిటీ విజ్ఞప్తి చేశారు. గురువారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవ్యాంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి మూడు విజ్ఞప్తులు వినతి పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఘంటసాల విగ్రహ సాధన కమిటీ అధ్యక్ష ,కార్యదర్శిలు వెంకటేశ్వర రెడ్డి, చింతకాయల చిట్టిబాబు, గాయని కంచర్ల రాజ్యం మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు అయినా రాష్ట్ర రాజధాని నిర్మాణం జరగలేదన్నారు. కానీ ప్రస్తుతం నూతనంగా కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు అమరావతి అభివృద్ధికి అడుగులు పడటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.


పంచాయతీ కార్యదర్శి వినతిపత్రం అందజేస్తున్న సాంబిరెడ్డి తదితరులు

రైతులకు రుణాలు మాఫీ చేయాలి

పంచాయతీ కార్యదర్శికి రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రైతులు, కౌలు రైతులకు రూ. 2 లక్షలు వరకూ బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. ఈ మేరకు రైతు సంఘం నాయకులు నందివెలుగు సచివాలయంలో కార్యదర్శి గద్దె సుభాష్ చంద్రబోస్ కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కేరళ తరహాలో రైతుల విమోచన చట్టంచేసి రైతాంగాన్ని అప్పుల బారి నుంచి విముక్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది రబిలో నష్టపోయిన జొన్న పంటకు ఇన్పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యజమానితో సంబంధం లేకుండా రైతులకు కౌలు కార్డులు అలాగే బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కౌలు సంఘం నాయకులు కూచిపూడి వెంకయ్య కోరారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో జి వెంకటేశ్వరరావు, టి తిరుమలరావు, కె కోటేశ్వరరావు, యం శ్రీనివాసరావు ఉన్నారు.



సెయింట్ ఆన్స్‌లో అన్నాంబ పండుగ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్, బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పునీత అన్నాంబ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేరీమాత తల్లి అన్నమ్మ ఎంతో క్రమశిక్షతో పిల్లలను విద్యాబుద్ధులతో పెంచిన ఆదర్శమూర్తి అని సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ విమల మేరీ.జి పేర్కొన్నారు. కరస్పాండెంట్ అమల మేరీ జోస్ఫిన్ మాట్లాడుతూ చదువుల తల్లి సెయింట్ ఆన్స్ ని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిస్టర్ ఝాన్సీ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వల్లో చెత్తవేస్తే జరిమాన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలో ఆరో వార్డు తదితర ప్రాంతాల్లో కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన పూడికను గురువారం జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ప్రత్యేక విభాగం అధికారులు మాట్లాడుతూ కాలువల్లో తాగిన ప్లాస్టిక్ గ్లాసులు, టీ గ్లాసులు వేయవద్దని సూచించారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా విడదీసి శానిటేషన్ సిబ్బందికి ఇంటి వద్దనే అందించాలని కోరారు. అలా కాకుండా కాలువల్లో వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒ ప్రవీణ్ మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి 12వ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న విఆర్‌ఒ ప్రవీణ్ (36) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. గుడివాడ-మచిలీపట్నం రోడ్డులో జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రవీణ్ స్వగ్రామం తుళ్లూరు గ్రామం మందడం గ్రామం. గత సంవ త్సరమే వివాహం జరిగింది. విఆర్‌ఒగా బాధ్యతులు నిర్వర్తిస్తూ తాడేపల్లిలో ప్రజల మన్ననలు పొందారు. ప్రవీణ్ మృతితో సచివాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.



ప్రాణాంతక 'కోనో కార్పస్ చెట్లను' తొలగించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్‌లో గల టిడ్కో గృహాల వద్ద దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు గోదా రమేష్ కుమార్ మాట్లాడుతూ కోనో కార్పస్ చెట్ల ద్వారా వీచే గాలి వలన చర్మ, శ్వాస కోశవ్యాధులు సంభవిస్తున్నట్లు శాస్త్రవేత్తలు, వైద్యులు సూచించారని, 10 రకాల చెట్లు తాగే నీటిని ఒక కోనో కార్పస్ చెట్టు తాగుతుందన్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోనో కార్పస్ చెట్లు ప్రాణాంతకమని తక్షణమే తొలగించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై నరసరావుపేట మున్సిపల్ కమిషనర్, పల్నాడు జిల్లా కలెక్టర్‌లకు విన్నవించామన్నారు. నరసరావుపేట పట్టణంలో, డివైడర్లలో, పోలీస్‌స్టేషన్ల వద్ద, కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద, టిడ్కో గృహాల మధ్య, వివిధ కళాశాలలు, పాఠశాలల వద్ద ఉన్న కోనో కార్పస్ చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పెదకూరపాడు

చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదల, పాలనలో విశేషానుభవం రాష్ట్రానికి ఎంతో మేలు చేసిందని టిడిపి జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, మౌలిక వసతులు కల్పనకు నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ మహిళల అధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి స్థానిక టిడిపి కార్యాలయంలో పాలాభిషేకం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఏం సాధించవచ్చో బాధ్యతలు చేపట్టి 50 రోజుల్లోనే చంద్రబాబు చూపించారని రమేష్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.లీలావతి, ముంతాజ్, ఎస్.కృష్ణకుమారి, కె.పద్మలత పాల్గొన్నారు.

పల్నాడు ఎస్పీని సన్మానించిన శ్రీధర్

ప్రజాశక్తి - పెదకూరపాడు



పల్నాడులో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు అసాంఘిక శక్తులను ఉక్కు పాదంతో అణిచి వేయాలని ఎస్పీకి పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఎస్పీని గురువారం కలిసి శ్రీధర్ చర్చించారు. అనంతరం ఎస్పీని శ్రీధర్ సన్మానించారు.

నీటి నిల్వల్లో గంబూషియా చేపల విడుదల



నరసరావుపేట పట్టణ సమీపంలోని వల్లప చెరువులో గంబూషియా చేప పిల్లలు వదులుతున్న జిల్లా మలేరియా అధికారి



సత్తెనపల్లి పట్టణంలోని బావుల్లో గంబూషియా చేపలను వదులుతున్న మలేరియా సిబ్బంది

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చెరువులలో నీటి కుంటలలో దోమలు, దోమల లార్వాలను నిర్వీర్యం చేసే గంబూషియా చేప పిల్లలు వదిలినట్లు పల్నాడు జిల్లా మలేరియా అధికారి ఎం.పద్మావతి, కె.రవీంద్ర రత్నాకర్ చెప్పారు. గురువారం పల్నాడు జిల్లాలోని ప్రధాన నీటి వనరులలో, నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి కలిగించే దోమలు దోమల లార్వాలను నిర్మూలించేందుకు పొన్నూరు ఫిషర్ హచరీస్ నుండి తీసుకువచ్చిన 1.50 లక్షల గంబూషియా చేప పిల్లలను నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ ప్రాంతాలలో గల నీటి కుంటలు, చెరువులు, బావులలో వదిలినట్లు పేర్కొన్నారు. జులై నుండి సీజనల్ వ్యాధుల తీవ్రత నేపథ్యంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ముందు జాగ్రత్తలో భాగంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.చంద్రశేకర్ సూచించారు. సత్తెనపల్లి పట్టణంలోని బావుల్లో దోమల లార్వాలను తినే గంబూషియా చేపలను మలేరియా సిబ్బంది గురువారం వదిలారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ దోమలు వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల సంతతి వద్ధి చెందుతుందని, లార్వా, ప్యూపా దశలలో ఉన్న దోమ పిల్లలను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపలను బావుల్లో వదలంటం వల్ల దోమల సంతతిని అరికట్టవచ్చని వివరించారు. ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, కెవి నాగమల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.ఎమ్ హుస్సేన్, షేక్ షరీఫ్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.



మాచర్లలోని మున్సిపల్ రిజర్వ్‌యర్‌లో గంబూషియా చేపల విడుదల చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మాచర్ల

దోమల లార్వాను నశింపచేసే గంబూషియా చేపలను మున్సిపల్ రిజర్వ్‌యిర్‌లో గురువారం విడుదల చేసినట్లు మలేరియా యూనిట్ అధికారి డి లక్ష్మయ్య తెలిపారు. తాగునీరు మరింత శుద్ధిగా ఉంచేందుకు గంబూషియా చేపలు ఉపయోగపడతాయన్నారు. నీటిలో, నీటిపై దోమల వృద్ధిని కూడ గంబూషియా చేపలు అడ్డుకుంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హష్టల్ ఖాన్, మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ టి.నాగేశ్వరరావు, సిబ్బంది దానం, విద్యాసాగర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

పట్టణంలో పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ దేవళ్ల వెంకటదాసు అన్నారు. పట్టణంలోని బురుజు సెంటర్, సుద్దగుంతల కాలనీ, లింగాపురం కాలనీ పలు వార్డుల్లో పారిశుధ్య పనులు, వాటర్ సరఫరా, కాల్వల పక్కన పిచ్చి మొక్కల తొలగింపు, వ్యర్థాల తొలగింపు తదితర పనులను అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుంటే ప్రజా ఆరోగ్యం బాగుంటుందన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని భారతాపురం పంచాయతీలో ఎంఆర్‌సి ప్రభాకర్‌రావు అధ్యక్షతన స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన సదస్సు, ర్యాలీ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ టి.రమణ మాట్లాడుతూ క్లాప్ మిత్రాలు ఎప్పటికప్పుడు కాల్వల్లో చెత్త నిలువ లేకుండా తొలగించాలన్నారు. చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డుకు తరలించాలని, గ్రామాన్ని, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై మురుగునీరు నిలవకుండా చూడాలని కోరారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ పి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగు దొడ్డిని ఉపయోగించాలని, సీజనల్ వ్యాధులైన డెంగి, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్ బాషా, ఎఎన్ఎం టి.రాజ్యలక్ష్మి, గురుప్రియ అంగన్వాడి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

17 అక్రమ కేసులు పెట్టినా లెక్కచేయలేదు : ఎమ్మెల్యే అరవిందబాబు

అసెంబ్లీలో సిఎం చంద్రబాబు అభినందనంపై హర్షం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యలపై పోరాడిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుపై గత ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి వేధించిందని, అయినా అరవిందబాబు ధైర్యంగా ఎదుర్కొన్నారని సిఎం చంద్రబాబు అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలపై శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రజా సమస్యలపై నిలదీసే నాయకులపై తప్పుడు కేసులు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అవినీతిని ప్రశ్నించడం టిడిపి నాయకులకు కార్యకర్తలకు అండగా ఉండడం నేరం అనేలా గత 5 ఏళ్ళ నియోజకవర్గంలో గోపిరెడ్డి వ్యవహరించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబుపై నమోదు చేసిన కేసుల గురించి చట్ట సభల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించడంపై డాక్టర్ చదలవాడతో పాటు చదలవాడ అభిమానులు, ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ 5 ఏళ్ల పాటు ఎన్ని అవమానాలు ఎదురైనా, పాలక పక్షం అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడినా ప్రజల కోసం పోరాటం చేయాలన్నా సంకల్పం ముందు అవన్నీ లెక్క చేయకుండా నిలబడ్డానన్నారు. 20 ఏళ్ల తర్వాత నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేయడంలో టిడిపి నాయకులు కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడడం ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అర్హులకు ఆందజేయడం తన ముందున్న కర్తవ్యమన్నారు. నియోజకవర్గంలో వైసిపి నాయకులు రెచ్చగొట్టినా టిడిపి నాయకులు కార్యకర్తలు సంయమనం పాటించాలని, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

సత్తెనపల్లి ఆస్పత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయండి

మంత్రి సత్య కుమార్‌కు విన్నవించిన ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం కలిశారు. సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలుగా మార్చాలని మూలన పడిన ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, పోస్టుమార్టం గదికి ఏసీ సౌకర్యం కల్పించాలని, అత్యవసర చికిత్సల వినియోగానికి బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హాస్పిటల్ ముందు ఉన్న వాటిని ఖాళీ చేయించాలి. అదే స్థానంలో షాపులునిర్మించి అద్దెకిస్తే ఆసుపత్రికి ఆదాయం సమకూరుతుందని మంత్రికి వివరించారు. ఆసుపత్రిలో డ్రెయినేజీ సమస్య పార్కింగ్ సమస్య ఉందని, సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు.



నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట : అడపా మస్తానమ్మ వర్ధంతి సందర్భంగా వారి మనవరాలు అడపా మాధురి కళ్యాణి స్థానిక నెహ్రూ నగర్‌లో గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, నోట్ బుక్స్, పెన్సిల్స్, రబ్బర్లు తదితర సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిడ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ విల్సన్ మాట్లాడుతూ ఇలాంటి సేవాకార్యక్రమాలు మరిన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిబాబు, హెచ్ఎం అబ్రహం నాయక్, సొసైటీ సభ్యులు ధనరాజు, ఖాజావలి, స్థానికులు టి.ఏసు పాల్గొన్నారు.

గిరిజనులకు నామినేటెడ్ పదవులివ్వాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట : నామినేటెడ్ పదవుల్లో గిరిజనులకు సముచిత స్థాన కల్పించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ కోరారు. స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం గిరిజనులకు నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో విఫలమైందని, ప్రదానంగా మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం కల్పించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వమైనా ఆ లోటును తీర్చాలన్నారు. టిటిడిలో, ఇతర దేవాలయాల్లో పాలకమండలి సభ్యుల్లో ఎస్టీలకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.నాగేశ్వరరావు, బి.చిన్న నాయక్, డి.డేవిడ్, ఎం.వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు అందేనా !

- జల్ జీవన్ మిషన్ పథకంలో రూ. కోట్లాది పనులు పెండింగ్
- కొన్ని చోట్ల కాంట్రాక్టర్లూ రాని వైనం
- కొత్త ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా?

ప్రజాశక్తి-తెనాలి

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని కుళాయి ద్వారా అందించాలన్న పథకం 'జల్ జీవన్ మిషన్' గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినా టెండర్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి. ఒక్క తెనాలి సబ్ డివిజన్‌లోనే దాదాపు రూ.82కోట్లు మంజూరైనా అధిక శాంతం టెండర్లు ఖరారుకాని పరిస్థి కనిపిస్తోంది. పైగా దాదాపు ఐదు కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు కూడా ఉన్నాయి. అధికారుల గణాంకాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సంకల్పించింది. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులను జమచేస్తే, కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులను విడుదల చేస్తుంది. 2024 లక్ష్యంగా 2019లో ప్రారంభమైన పనులు ఇంకా ఆశించిన లక్ష్యాలను చేరుకోలేదు. దీనికి తాజా ఉదాహరణ గత ప్రభుత్వంలో చేసిన పనులకు చెల్లింపులు నిలిచిపోవటం, ఫలితంగా కొత్తగా మంజూరైన పనులకు టెండర్లు దాఖలు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల ముందుకు రాని పరిస్థితులున్నాయి. ముఖ్యంగా తెనాలి సబ్ డివిజన్‌లో దాదాపు 83 కోట్ల విలువైన 238 పనులు గుర్తుంచారు. డివిజన్‌లోని తెనాలి నియోజకవర్గంలో 142 పనులకు రూ.49 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అలాగే పొన్నూరు నియోజకవర్గంలో 96 పనులకు రూ.33 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వీటిని మండలాల వారీగా పరిశీలిస్తే తెనాలి మండలంలో 22 పనులకు 12.22 కోట్లు నిధులు మంజూరు కాగా, 15 పనులకు సంబంధించి టెండర్లే దాఖలు కాలేదు. కొల్లిపర మండలంలో 33 పనులకు సంబంధించి రూ.3.64కోట్లు మంజూరు కాగా, పది పనులకు ఇంకా టెండర్లు ఖరారు కావాల్సి ఉంది. పెదకాకాని మండలంలో 6 పనులకు సంబందించి రూ.3.54కోట్ల విలువైన పనులకు టెండర్లు ఫైనల్ కాలేదు. పొన్నూరు మండలంలో 40 పనులకు సంబందించి రూ.15కోట్లు మంజూరు కాగా, 26 పనులకు టెండర్లు ఖరారు కాలేదు. చేబ్రోలు మండలంలో 29 పనులకు సంబందించి, రూ.7.92 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ.6.68 కోట్ల విలువైన 19 పనులకు టెండర్లు ఖరారు కాలేదు. ఇక బకాయిలను పరిశీలిస్తే తెనాలి సబ్ డివిజన్ పరిధిలో రూ.కోటి పెండింగ్ ఉండగా, జిల్లా వ్యాప్తంగా రూ.5కోట్లు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పనుల విధానాన్ని పరిశీలిస్తే దీనిలో గ్రామీణ నీటి సరఫరా విభాగం, గ్రామ పంచాయతి సమిష్టి బాధ్యతతో ఈ పథకాన్ని ముందకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత ఉంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం వాటర్ ట్యాంకు నిర్మాణం, గ్రామ పంచాయతీ ద్వారా కుళాయి కనెక్షన్లు అవసరమైన వారి జాబితా సేకరించి, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయటం, పైప్‌లైన్ ఏర్పాటు వంటివి చేస్తుంది. ఇక నీటి సరఫరా, వాటి పరిశీలన బాధ్యత గ్రామ పంచాయతీపై ఉంది. నీటి నాణ్యత పరిశీలన సచివాలయాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చి, నీటి నాణ్యత పరిశీలన కిట్లను కూడా అధించినట్లు అధికారులు చెబుతున్నారు. అంతా బాగానే ఉన్నా చేపట్టిన పనులు మందకొడిగా సాగటం చర్చనీయాంశమైంది. రూరల్ గ్రామం కొలకలూరులో రెండేళ్ళ క్రితం కొలకలూరులో ప్రారంభించిన జల్‌జీవన్ మిషన్ పనులు ఇంకా కొలిక్కి రాలేదు. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే నీటి సరఫరా ప్రారంభించాల్సి ఉన్నా ఇంకా ట్రయల్ రన్‌లోనే ఉంది. కొన్ని చోట్ల టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాకపోవటం, మరి కొన్ని చోట్ల టెండర్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటం చర్చనీయాంశం.



కొలకలూరులో జల్ జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది

-మహ్మద్ అబ్దుల్ మజీద్, డిఈ, ఆర్‌డబ్ల్యుఎస్, తెనాలి



తెనాలి సబ్ డివిజన్ పరిధిలో దాదాపు రూ.82కోట్లు నిధులు మంజూరయ్యాయి. 238 పనులు చేయాల్సి ఉంది. వీటిలో కొన్నిపనులకు టెండర్లు ఖరారు కాగా, మరికొన్నింటికి టెండర్లు ఖరారు కావాల్సి ఉంది. కొన్ని చోట్ల టెండర్లే దాఖలు కాలేదు. ప్రారంభించిన పనులను కొనసాగిస్తున్నాం. ఇక బకాయిల విషయానికి వస్తే తెనాలి సబ్ డివిజన్‌కు రూ.కోటి, జిల్లా వ్యాప్తంగా రూ.5 కోట్లున్నాయి.

ఉత్తమ విద్యార్థులుగా తయారవ్వండి

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ విద్యార్థులుగా వెలుగొందాలని శిక్షా సప్తాహ్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.విజయలక్ష్మి కోరారు. గురువారం పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్లో సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా చరిత్రకు సంబంధించిన పుస్తకాలను కూడా అధ్యయనం చేయాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆచార వ్యవహారాలను తెలుసుకోవాలని చెప్పారు. మాతృభాషతో పాటు వివిధ భాషల్లో ప్రావీణ్యం ఉంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు భాషల్లో ప్రసంగించి ఆకట్టుకున్నారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన పిల్లలు వారి భాషల్లో మాట్లాడారు. సభకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సయ్యద్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పి.దానయ్య, ఫిజికల్ డైరెక్టర్ బి.రమేష్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు మోక్షం

ప్రజాశక్తి-తాడేపల్లి

రెండు సంవత్సరాల క్రితం సిఎం జగన్ నివాసానికి వెళ్లే దారిలో ఉన్న భరతమాత విగ్రహం, ఎనిమిది సంవత్సరాల క్రితం ఉండవల్లిలో తొలగించిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహం నిర్మాణాలకు మోక్షం లభించినట్లేనని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. గురువారం ఎంటిఎంసి మున్సిపల్ డిపిటి ఆశోక్‌కుమార్‌తో కలిసి విగ్రహాలు తొలగించిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని వెంకట్రావు చెప్పారు. ఉండవల్లి సెంటర్‌లో రంగా విగ్రహాన్ని తొలగించిన స్థలంలో కాకుండా వర్కుషాపుకు వెళ్లే దారిలో సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేయడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు హామీనిచ్చినట్లు తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు ఆటంకాలు తొలిగినట్లేనని కాపు జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నా రాజేష్ చెప్పారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మంగళగిరి పట్టణంలో గురువారం పారిశుధ్యపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణలో మంగళగిరి పట్టణంలోని టిడ్కో గహ సముదాయం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తను శానిటేషన్ సిబ్బంది తొలగించారు.







చెత్త, వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి - మంగళగిరి

దోమలను నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. గురువారం మంగళగిరి పట్టణంలోని చిన్న కోనేరులో డెంగ్యూ మా సోత్సవాలలో భాగంగా నీటి నిల్వలో ఉన్న ప్రాంతంలో గంబుషియా చేపలను వదిలారు. రెండు లక్షల చేపలను వదలడం జరిగింది. దీనివలన నీటి నిల్వలో ఉన్న దోమల ఉత్పత్తిని నిర్మిలించడం జరుగుతుందని సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. దోమ కాటు వలన డెంగ్యూ, చికెన్ గునియా వంటి వ్యాధులు ప్రజలకు వస్తాయని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్, స్థానిక మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్ బాబు, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి లక్ష్మీపతిరావు, స్థానిక మలేరియా యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్వైజర్ ఎం సాగర్, శ్రీనివాసరావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాచేస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - గుంటూరు సిటి : గంజాయి వంటి మాదకద్రవ్యాలు సేవించినా, విక్రయించినా, రవాణా చేసిరా కఠినమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ హెచ్చరించారు. అటువంటి వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. మహిళలు, ఆడపిల్లలు పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ఇటువంటి నేరాలకు తరచుగా పాల్గొన్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు.

యంత్రాలతో పూడికతీత

ప్రజాశక్తి - పొన్నూరు

రానున్న వర్షాకాలం ను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఉన్న మేజర్ కాలవల్లో పేరుకుపోయిన మురుగు, ఇసుక మేటలు వ్యర్థాలను, పూడికను గురువారం హిమెన్ యంత్రాలతో తొలగించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ వారికి పురపాలక సంఘం కమిషనర్ సిఎంఈ నయీమ్ అహ్మద్ పట్నంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశానుసారం 22వ వార్డు ఎస్.పి.పి రోడ్డు, ముబారక్ నగర్ మేజర్ కాలువ, పొన్నూరు పట్టణ శివారులో కసుకర్రు రోడ్డు పెద్ద కాలువలలో పూడికలు తొలగించారు. అలాగే పొన్నూరు పురపాలక సంఘం లోని ఒకటో వార్డు, డివిసి కాలనీలో మురికి కాలువలు శుభ్రం చేసిన తర్వాత పవర్ స్ప్రే తో దోమల నివారణ కు మందు పారిశుధ్య కార్మికులు పిచికారి చేశారు . సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా విద్యుత్ లైన్లు

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి ఎఫ్‌సిఐ నుంచి అంజిరెడ్డి కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ దారి వెంట నడిచి వెళ్తుంటే గమనించకపోతే పాదచారులకు, వాహన దారులకు విద్యుత్ వైర్లు తగిలి పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఉదయానే ఈ మార్గాన పట్టణ ప్రజలు పెద్దఎత్తున నడక సాగిస్తుంటారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

పరిశుభ్రతతో అతిసార నియంత్రణ

ప్రజాశక్తి - తెనాలి

అతిసార నియంత్రణ వ్యక్తిగత పరిశుభ్రతతోనే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న అన్నారు. స్థానిక బోస్ రోడ్ లోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో అతిసార నియంత్రణ అవగాహన కార్యక్రమం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ శుభ్రత అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా ముఖ్యమన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల మాట్లాడుతూ కలుషితమైన, నిలువ ఉంచిన ఆహారాన్ని తినడం మంచిది కాదన్నారు. మూతలు లేని, ఈగలు వాలిన ఆహారం తినడం ద్వారా డయేరియా సోకే ప్రమాదం ఉందన్నారు. ఒకేరోజు మూడు దఫాలుగా నీళ్ల విరోచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడం శ్రేయస్కరం అన్నారు. మురళి కాంత్ దాసరి మాట్లాడుతూ పరిశుభ్రత తోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆరోగ్య కార్యకర్త విజయకుమారి చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఎ రామచంద్రరావు, పురపాలక సంఘం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కమిషనర్, హెల్త్ ఆఫీసర్ ను పాఠశాల యాజమాన్యం సత్కరించారు.



తహశీల్దార్ కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న సిబ్బంది

తహశీల్దార్‌కు వీడ్కోలు పలికిన సిబ్బంది

ప్రజాశక్తి - తెనాలి

ఎన్నికల విధుల నిర్వహణకు బదిలీపై వచ్చి తిరిగి యధా స్థానానికి వెళుతున్న తహసిల్దార్ వీక్ కోల్కతా గురువారం సిబ్బంది నిర్వహించారు. ఎన్నికల సమయంలో నెల్లూరు నుంచి ఎస్ శ్రీనివాసరెడ్డి బదిలీపై తెనాలి వచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తిరిగి యధా స్థానానికి వెళుతున్న తహసిల్దార్ శ్రీనివాసరెడ్డికి సిబ్బంది వీడ్కోలు పలికారు. తెనాలిలో ఆయన విధి నిర్వహణకు సంబంధించిన ఫోటోలతో కూడిన ఫోటో ఫ్రేమ్ బహుకరించారు. కార్యక్రమంలో డిటి హెనిప్రియ, ఆర్ఐ జాన్, ఎఎస్ఓ వేణుబాబు, సర్వేయర్ శ్రీనివాసరావు, విఆర్వో లు, విఆర్ఎ లు పాల్గొన్నారు.



ఎఎన్‌యు డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9792 మంది హాజరు కాగా వారిలో 5670 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు పరీక్షలు నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్ రావు మాట్లాడుతూ డిగ్రీ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.anu.ac.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఆగస్టు 8వ తేదీలోగా ఒక్కో పేపర్ కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే పర్సనల్ వెరిఫికేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.1260 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా వర్సిటీ డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఇన్చార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె . రత్నషీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్య కోలే, సిటిఏ ప్రొఫెసర్ సత్యనారాయణ, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ భవిత, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాల విద్యలో సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ కోరారు. ఈమేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైజలకు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలు అన్నింటిలో 1 నుండి 5వ తరగతి వరకూ తరగతులు ఉండాలని, హైస్కూళ్లలో తెలుగు ఇంగ్లీషు మీడియం రెండూ కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లలో పోస్టులు అప్‌గ్రేడ్ చేసి, ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలల మూసివేత తగదని, వాటిని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎండి.గయాసుద్దొలా, జిల్లా కౌన్సిలర్ ఎం.డి.షకీలాబేగం, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ లైబ్రేరియన్‌కు అయ్యంకి, వెలగా పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయ అధికారిణి ఆచంట రజనీకుమారి గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయ గాంధీ డాక్టర్ వెలగా వెంకటప్పయ్యల పేర్లతో ప్రతిష్టాత్మకంగా ఇచ్చే గ్రంథాలయ పురస్కారం అందుకున్నారని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వీసీ మాట్లాడుతూ అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరులోని బందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కేజీ శంకర్, డాక్టర్ ఆరేటి కష్ణకుమారి చేతుల మీదుగా గ్రంథాలయ పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు. రజనీకుమారి గడిచిన 28 సంవత్సరాలుగా లైబ్రేరియన్‌గా ఎంతో విలువైన సేవలు అందించారని, వర్సిటీలో డిజిటల్ లైబ్రరీను ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులకు అవసరమైన పుస్తకాలను, పరిశోధన పత్రాలను అందజేయడంలో చేసిన కషికి గాను ఈ పురస్కారం లభించిందన్నారు. ఏపీఎల్ఏ శాశ్వత సభ్యురాలిగా గుర్తింపు పొందటంతో పాటు అనేక విశ్వవిద్యాలయాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని గ్రంథాలయ అభివద్ధిపై అనేక పత్రాలను సమర్పించారన్నారు. ఈ సందర్భంగా రజనీకుమారిని విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, తదితరులు అభినందించారు.



రజనీకుమారిని అభినందిస్తున్న లావు రత్తయ్య తదితరులు

నిరాశాజనకంగా కేంద్ర బడ్జెట్ : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

వికసిత భారత్ పేరుతో కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, ఉపాధి కొరత వంటి సమస్యలకు నిర్దిష్టమైన పరిష్కారాలను సూచించడంలో కేంద్ర బడ్జెట్ విఫలమైందని శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ' కేంద్ర బడ్జెట్ - విశ్లేషణ' అనే అంశంపై గురువారం సాయంత్రం బ్రాడీపేట లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఇంజినీర్ జి.వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన లక్ష్మణ రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు నిధులు తగ్గించేశారని, ఎరువులు, ఆహార భద్రతకు సంబంధించి కోత విధించా రన్నారు. సహకార ఫెడరలిజం స్ఫూర్తి ని ఆచరణలో కనిపించలేదని, మణి పూర్, నాగాలాండ్, త్రిపుర వంటి పేద రాష్ట్రాల సంక్షేమం విస్మరించారు. పదేళ్ల తర్వాత బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కొంత మేరకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే బడ్జెట్‌లో వాగ్దానం చేసిన రూ.15 వేల కోట్లు గ్రాంట్ రూపంలో ఇచ్చి ఉండాలని, పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు, అలాగే ప్రాజెక్టు పునరావాసం కోసం నిర్దిష్ట ప్రణాళిక బడ్జెట్‌లో చెప్పి ఉండాల్సిం దని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం 9.2 శాతానికి చేరుకుందని, ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు చేయలేదని అన్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కావడం వల్లనే ఆంధ్రప్రదేశ్ అభివద్ధి కోసం కొంత ప్రయత్నం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల తరపున ఎమ్. కళాధర్, వివికె సురేష్, పి. ఎస్. శేఖరరెడ్డి, బి.ముత్యాల రావు, వై.నేతాజీ, ఎన్. సదాశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సైన్స్, టెక్నాలజీ అభివృద్ధితోనే దేశ పురోగతి

షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

అంతరిక్ష పరిశోధనల్లో 2047 నాటికి భారత దేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రస్థానంలో నిలపడమే తమ ధ్యేయమని, మానవాళికి మెరుగైన జీవన ప్రమాణాన్ని అందించే దిశగా విద్యార్థులు సాంకేతిక విజ్ఞాన పరిశోధనల వైపు దృష్టి సారించాలని శ్రీహరికోట షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఇస్రో, షార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. ఇందులో భాగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చి వీక్షించారు. ఈ స్పేస్ ఎగ్జిబిషన్‌లో ఉంచిన ఎస్ఎల్‌వి-3, ఎఎస్ఎల్‌వి, పిఎస్ఎల్‌వి, హెచ్ఆర్ఎల్‌వి రాకెట్ నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ముగింపు సభలో షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు మాట్లాడుతూ భూ సర్వే, రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, నావిగేషన్, కమ్యూనికేషన్ సాంకేతిక వ్యవస్థల్లో మెరుగైన ఫలితాల సాధన దిశగా త్వరలో ఎస్ఎల్‌వి డి3, పిఎస్-ఎల్‌వి సి59, జిఎస్ఎల్‌వి ఎఫ్-15 రకాల ఉపగ్రహాల ప్రయోగాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆస్ట్రోనాట్స్ భూమికి తాకటం వల్ల సంభవించే పెను ప్రమాదాల నుంచి మానవాళిని రక్షించుకునేందుకు అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రాలతో అనుసంధానం జరుపుతూ ఆస్ట్రోనాట్స్‌ను ఢీకొట్టి వాటి కక్ష్య దిశను మార్చే విధంగా రాకెట్ల తయారీకి పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సాంకేతికతవైపు దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. వివిధ సాంకేతిక అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జి.రమేష్‌బాబు, కళాశాల యాజమాన్యం చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్ గురువారం అభినందించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఉండాలని, ఎక్కడో మార్పు రావాలి, వాళ్ళు మారాలి అనే భావన తొలగించి, మార్పు మన నుంచే మొదలవ్వాలని చెప్పారు. ముందుగా కళాశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉంచడం, మొక్కలు నాటి వాటిని సంరక్షించటం, ప్లాస్టిక్ నిషేదం, ప్రకతి రక్షణ వంటి కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వ్యక్తులకు సహాయం చేయడం, వైద్యశిబిరాలు వంటివి ఏర్పాటు చేయాలని తెలియచేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. జెవి సుధీర్ కుమార్, కళాశాల యన్‌యస్‌యస్ రెండవ విభాగం కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్ జయశైలజ పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పత్తి పంట సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

లాంఫాం డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్

ప్రజాశక్తి - తుళ్లూరు

అధిక వర్షాల నేపథ్యంలో పత్తి పంటను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని లాం వ్యవసాయ పరిశోధన స్థానం డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ అన్నారు. గురువారం మండలంలోని పెద పరిమి, వడ్డమాను గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తికి పోషకాలను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెగ్నీషియం సల్ఫేట్, మల్టీ కె లను ఎకరాకు ఒక్కొక్క కిలో చొప్పున రెండు లీటర్ల నీటితో కలిపి పత్తి పంటపై ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ దశలో జీవన ఎరువులు అయినా అజోస్పైరులమ్, ఫాస్పేట్, సాల్యుబుల్ బ్యాక్టీరియా, పొటాషియం, బీజింగ్ బ్యాక్టీరియాలను అర లీటర్ చొప్పున నీటిలో కలిపి ఎకరాకు నాజిలున్న సీసా లేదా డబ్బాలో పోసి మొక్కల మొదళ్ళ వద్ద పోయాలన్నారు. ఇలా చేయడం వల్ల నేల గుల్లబారి నేలలో లభ్యంకాని పోషకాలు మొక్కలకు సక్రమంగా అందడంతో పాటు గాలిలోని నత్రజని ఉపయోగించుకుని మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ కె శ్రీరంజని, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, ఎఓ శ్రీ రంజని